క్లుప్తంగా

గణాంక శాస్త్ర కోర్సుల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో సీపీఓ హిమ ప్రభాకరరాజు

కర్నూలు(సెంట్రల్): గణాంక శాస్త్ర కోర్సులు చదివిన విద్యార్థులకు ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కర్నూలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి హిబ ప్రభాకరరాజు సూచించారు. శుక్రవారం సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంక కార్యాలయ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గణాంక శాస్త్ర అవగాహన కోసం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఓ హిమ ప్రభాకరరాజు బహుమతులుఅందజేశారు. కార్యక్రమంలో జాతీయ ఉప గణాకం కార్యాలయాధికారి అమృత, ప్రిన్సిపాల్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ఇవ్వడంపై హర్షం

కర్నూలు(అర్బన్): స్వర్గీయ భారత ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం హర్షణీయమని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్ర శేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి 1991లో జరిగిన ఎన్నికల్లో 6 లక్షలకు పైగా మెజారిటీతో విజయం సాధించి దేశ ప్రధాని పదవి చేపట్టారన్నారు. బ్రాహ్మణ జాతి రత్నం , రాజకీయ దురంధరుడైన పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఇందుకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్):నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కర్నూలు టౌన్ డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చక్రపాణి తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల మెయిన్‌టెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

హిట్ అండ్ రన్‌చట్టాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): డ్రైవర్లను జైలుకుపంపే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా రవాణా సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజ శ్యామల నవరాత్రులు

కర్నూలు కల్చరల్:ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో మాఘ శుద్ధ పాడ్యమి శనివారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు రాజశ్యామల నవరాత్రులు నిర్వహిస్తున్న ట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నా రు.లలితా త్రిపుర సుందరీ దేవికి శ్రీ విద్య సంప్రదా యానుసారం శ్రీ రాజ శ్యామల నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు..

డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు: డ్రైవర్లు తరచూ కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. జాతీయ రవాణా రోడ్డు భద్రత 35వ మాసోత్సవాల సందర్భంగా డీటీసీ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్లకు జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శాంతిరామ్, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఉచిత వైద్యశిబిరంలో పాల్గొని బీపీ, షుగర్, ఈసీజీ, గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. అలాగే శాంతిరామ్ హాస్పిటల్‌కు సంబంధించిన డాక్టర్లు కళ్ల పరీక్షలు నిర్వహించి మదర్‌థెరిస్సా ఫౌండేషన్ సౌజన్యంతో ఉచితంగా కళ్లద్దాలను జేసీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్‌తో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, పలువురు డాక్టర్లు, ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.





సెల్యూట్ చేస్తూ స్కేటింగ్.. దూసుకెళ్తూ..

పాదరసంలా కదులుతూ.. గిర్రున తిరుగుతూ

ఏటావాలులో పాదరసంలా కదిలిపోతూ.. మధ్యమధ్యలో గిర్రున తిరుగుతూ..జంప్ చేస్తూ క్రీడాకారులు చేసిన స్కేటింగ్ విన్యాసాలు అబ్బురపరిచాయి. రాయలసీమ జిల్లాల్లోనే తొలి స్కేటింగ్ రింగ్‌ను కర్నూలు నగరపాలక సంస్థ 19వ వార్డులో శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా చిన్నారులు, బాలలు స్కేటింగ్ ఆడారు. కిందపడకుండా ఒకరికి ఒకరు పోటీపడుతూ ముందుకు వెళ్లారు. కొందరు మువ్వన్నెల జెండా పట్టుకుని చేసిన విన్యాసం వీక్షకులను ఆకట్టుకుంది.

–సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు



జాతీయ పతాకం చేతపట్టుకొని విన్యాసం..



స్కేటింగ్ చక్రాలు చూపిస్తూ..



రయ్‌రయ్‌మని.. ఉత్సాహంగా చిన్నారులు



స్కేటింగ్ రింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

స్పోర్ట్స్

క్రీడలతో మానసికోల్లాసం

కల్లూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషన్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం రాత్రి కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని లక్ష్మీటౌన్‌షిప్‌లో రూ. 40లక్షల వ్యయంతో నిర్మించిన 110 మీటర్ల స్కేటింగ్ రింగ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో కర్నూలు జిల్లాలో మొట్టమొదటి స్కేటింగ్ రింగ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలను చదువుతో పాటు ఆసక్తి గల క్రీడాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారన్నారు. క్రీడాలు ఆడటం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈ నెల 21 నుంచి 25 వరకు బీహార్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇరువురు విద్యార్థులు పి.జోసఫ్ (మాంటిస్సోరి హై స్కూల్) డి.సాయి అమృత (చైతన్య జూనియర్ కళాశాల)లు ఎంపికయ్యారు. వీరిని మాంటిస్సోరి హైస్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.13.90 లక్షల విరాళం



చెక్కును అందిస్తున్న బుట్టా రేణుక

కర్నూలు(అర్బన్): నగరంలోని ముజాఫర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పరమేశ్వరి దేవి, శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయానికి ఎం. కృష్ణయ్య దంపతులు రూ.13.90 లక్షలను విరాళంగా అందించారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక దేవాలయ ట్రస్ట్‌కు చెందిన జగన్ సత్యనారాయణకు అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కుర్ణి సంఘం నాయకులు బందికె వాసుదేవయ్య, ఓంకారయ్య, గడిగె ప్రసాద్, మాదుగుండు ప్రసాద్, కేపీ రాధాక్రిష్ణ, గడిగె మేఘశ్యాం, మాదుగుండు రాందాసు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ ...

భగీరథ ఉప్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుట్టా రేణుక ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి. సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో నిర్వహిస్తున్న కర్నూలు బాలోత్సవం వేడుకలు శుక్రవారం ముగిశాయి. రెండు రోజుల పాటు ఉత్సాహంగా ఉల్లాసంగా సాగిన వేడుకల్లో పలు విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని అలరించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపన, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, లఘునాటికల పోటీలు నిర్వహించారు. అతిథులు విజేతలకు బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరమవుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గత మూడు సంవత్సరాల నుంచి బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ, రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య, ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్, కేవీ సుబ్బారెడ్డి, మైత్రి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్, రవీంద్ర విద్యా సంస్థల వైస్ చైర్మన్ వంశీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ కల్చరల్ కార్యదర్శి బసవరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్, నరసింహ, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, సాహిత్రీ స్రవంతి జిల్లాప్రధాన కార్యదర్శి చక్రపాణి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పావనీలతను ఆదర్శంగా తీసుకోవాలి



పావనీలత చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పావనీలతను ఆదర్శంగా తీసుకొని అవయదానానికి ముందు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఇటీవల బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందిన పావనీలత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పావనీలత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ..పావనీలత తాను చనిపోతూ కూడా తన అవయవాలను ఇతరులకు దానం చేసి ఆరుగురికి ప్రాణం పోషిందన్నారు. ఈమెను ఆదర్శంగా తీసుకొని అవయదానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథం, ఎస్ఎన్ రసూల్, రామకృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



పదవీ విరమణ చేసిన మాలినిని సత్కరిస్తున్న ఉద్యాన అధికారులు, సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): చిత్తశుద్ధితో పనిచేస్తే సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవీ, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఉద్యానభవన్‌లో జనవరి 31న పదవీ విరమణ చేసిన ఉద్యాన శాఖ 'మాలి' గోపాలకృష్ణను శుక్రవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఏపీఎంఐపీ పీడీతో పాటు జిల్లా ఉద్యాన అధికారి, పలువురు హెచ్‌వోలు, సిబ్బంది ఆయనకు జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజకృష్ణారెడ్డి, సాంకేతిక ఉద్యాన అధికారి అనూష, ఉద్యాన శాఖ విశ్రాంత డీడీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ మైదానానికి బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్, అడిషనల్ కమిషనర్

కర్నూలు (టౌన్) : నగరపాలక ఎగ్జిబిషన్ మైదానానికి శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో కమిషనర్ భార్గవ్‌తేజ, నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో పాటదారులు పోటీపడ్డారు. బెంగుళూరు, తిరుపతి, నంద్యాల పట్టణాలకు చెందిన పలువురు పోటీలో పాల్గొన్నారు. నగరపాలక రెవెన్యూ అధికారులు రోజు వారి బాడుగ కింద రూ. 20 వేలు గుడ్‌విల్ నిర్ణయించారు. సి. కె. ప్రసాద్ అనే పాటదారుడు రోజుకు అత్యధికంగా రూ.1.46 లక్షలు పాట పాడి వేలం దక్కించుకున్నాడు. మూడు నెలల పాటు ఈ పాటదారుడు ఎగ్జిబిషన్ మైదానాన్ని లీజుకు తీసుకున్నాడు. దీంతో నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.1.57 కోట్లు ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, వాజిద్ పాల్గొన్నారు.

స్కేటింగ్ రింక్ వేలాలు వాయిదా

నగరపాలకలోని 19 వ వార్డు పరిధిలో స్కేటింగ్ రింక్‌ను కేటాయించేందుకు శుక్రవారం నగరపాలక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. ప్రతి నెల రూ.25 వేల ప్రకారం నిర్వహించిన ఈ వేలానికి పాటదారుల నుంచి స్పందన రాలేదు. దీంతో నగరపాలక రెవెన్యూ అధికారులు వేలాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు.

కులగణన సర్వే 90 శాతం దాటాలి

● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (సెంట్రల్): కులగణన సర్వే 90 శాతం దాటాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కులగణన సర్వే, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్, ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫారమ్స్ డిస్పోజల్ తదితర అంశాలపై ఆర్ఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులగణన సర్వేలో 14 మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. మద్దికెర, కోసిగి, వెల్దుర్తి, క్రిష్ణగిరి తదితర మండలాలతో పాటు కర్నూలు కార్పొరేషన్‌లో కులగణన సర్వే వేగవంతం కావాలన్నారు. ఆదివారం సాయంత్రం లోపు సర్వేలో పురోగతిని తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే 20 శాతం నుంచి 50 శాతం వచ్చిందని, అయితే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించడంలో మాత్రం వెనుకబడి ఉన్నామని, కౌతాళం, క్రిష్ణగిరి, మంత్రాలయం, కోసిగి, హొళగుంద, కర్నూలు అర్బన్ తదితర మండలాల్లో పురోగతి రావాలని ఆయా మండలాల ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్ ఫారమ్స్ డిస్పోజల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్వోలను ఆదేశించారు. పేదలకు సంబంధించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.285 కోట్లు



లీజు, బడ్జెట్‌పై చర్చిస్తున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(టౌన్) : 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.285 కోట్లుగా ఖరారు చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో స్టాండింగ్ కమిటీ పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రెండున్నరేళ్ల తన పాలక వర్గ హయాంలో నగరపాలక సంస్థకు గణనీయంగా ఆదాయాన్ని పెంచినట్లు చెప్పారు. తద్వారా వార్డుల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. బిర్లా గేట్ వద్ద ఉన్న ఖానా ఖజానాకు సంబంధించి లీజు గడువును మూడు సంవత్సరాలకు పొడిగించడంతో పాటు బంగి అనంతయ్య కాంప్లెక్స్‌లో ఖాళీ ఉన్న షాపులకు బహిరంగ వేలం వేయాలని, కింగ్ మార్కెట్‌లోని కూరగాయల చిల్లర వ్యాపారం, చేపల మార్కెట్, సైకిల్ స్టాండ్‌ల ఫీజును వచ్చే ఏడాది మార్చి వరకు గడువు పెంచాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, నాగలక్ష్మీరెడ్డి, సుదర్శన్ రెడ్డి, జి.ఎల్.బి.సుజాత, పద్మలత, నగరపాలక అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

కర్నూలు (న్యూటౌన్): 30వ వార్డు కార్పొరేటర్ జయరామ్, అతని సోదరులు కరుణాకర్, అభి, మరో ఇద్దరిపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పాతకక్షల నేపథ్యంలో గురువారం రాత్రి నిందితులు తనపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు షరీన్‌నగర్‌కు చెందిన ప్రభాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

కాలువలో పడి వ్యక్తి దుర్మరణం



శ్రీధర్‌రెడ్డి మృతదేహం

కర్నూలు : మిడుతూరు మండలం పీరుసాబ్‌పేట గ్రామానికి చెందిన కై పా శ్రీధర్ రెడ్డి (53) హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో శవమై తేలాడు. ఈనెల 7వ తేదీన దిగువపాడు గ్రామ శివారులో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ గట్టుపైన తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి కనిపించకుండా పోయాడు. శుక్రవారం ఉదయం వెల్దుర్తి మండలం మల్లెంపల్లె వద్ద శవమై తేలాడు. వెల్దుర్తి పోలీసుల సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని నీటిలో నుంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయినట్లు తమ్ముడు వెంకటరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు : నగర శివారులోని డాక్టర్స్ కాలనీ దగ్గర ఉన్న కిసాన్ నగర్ పార్కు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు ఉంటాడు. ఛామన ఛాయ వర్ణం కలిగి ఉండి, తెల్లని గడ్డం, ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, నడుముకు నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలసిన మొలతాడు ఉంది. ఆచూకీ తెలిసినవారు 91211 01061 లేదా 96032 47415కు సమాచారం తెలియజేయాలని మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి కోరారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత హరి హరి క్షేత్రంలో ఆలయం 18వ వార్షిక వేడుకలు శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కల్లె చంద్రశేఖర శర్మ, రాజశేఖరరావు పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు పంచామృతాభిషేకం, విశేష హోమాలు, సాయంత్రం వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహరరావు, సంఘం సభ్యులు రామ మనోహర్, సోమనాథమూర్తి, శ్రీనాథ్, విజయసారథి, రాజేష్, ఆలయ అర్చకులు, సేవాదళ్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా కడుక్కోవాలి

కర్నూలు సిటీ: విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ సీహెచ్ విజయ జ్యోతి కుమారి సూచించారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ విద్యాలయంలో జాతీయ నూలి పురుగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో జీసీడీఓ సునీత, కేజీబీవీలో ఎస్ఓ స్వప్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.